సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 02 | సంచిక : 59 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం | 18.06.2025

## 1.35 లక్షల మంది రైతులకు

# రూ. 106.08 కోట్లు

## రైతు భరోసా నిధులు జమ

### వివరాలు వెల్లడించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా



**జనగామ, మన చౌరాస్తా :** చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రైతుభరోసా పథకం తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఈ వానాకాలం 2025 సంబంధించి పంట పెట్టుబడి సాయం అందిస్తోంది. జనగామ జిల్లాలో ఇప్పటి వరకు 1,35,602 మంది రైతులకి రూ.106.08 కోట్ల నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ అయినట్టు మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటన లో తెలిపారు. జనగామ జిల్లాలో 1,98,072 మంది రైతులకి రూ.240.22 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉండగా.. 1,83,907 మంది రైతుల బ్యాంకు ఖాతా వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్‌లో పొందుపరిచారని వివరించారు. అందులో 1,66,264 మంది రైతులకి రూ.176.83 కోట్లు నగదు బదిలీ కోసం ట్రెజరీలో రాష్ట్ర ప్రభుత్వం బిల్స్ రూపం లో సబ్మిట్ చేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 1,35,602 మంది రైతులకి రూ.106.08 కోట్లు రైతు భరోసా నిధులు జమ అయ్యాయని తెలపిరు. మిగతా వారికి కూడా అతి త్వరగా వారి ఖాతాలో డబ్బులు జమ అవుతాయని వివరించారు.




2 లో

## ఇంటి నంబర్ల కోసం దీక్ష





# జనగామ కలెక్టర్ విస్తృత పర్యటన

### పెట్రోల్ బంక్ కోసం స్థలాన్ని పరిశీలన

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఖిలాషాపూర్ క్రాస్ రోడ్డు వద్ద చాకలి ఐలమ్మ జిల్లా సమాఖ్య, స్వయం కృషి దివ్యాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ నిర్మాణ స్థలాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా మంగళవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి వసంత, తహసీల్దార్ మోసిన్, డీపీఎం రాజేంద్రప్రసాద్ ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 12 గుంటల స్థలంలో పెట్రోల్ బంకు నిర్మాణం ఓసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) నుంచి అనుమతి లభించిందని, సుమారు 70 లక్షలతో నిర్మించనున్న ఈ పెట్రోల్ బంక్ నిర్మాణంతో మహిళా సమాఖ్య అభివృద్ధి పథంలో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

### ఇందిర మహిళా శక్తి భవన కోసం..

జనగామ మండలంలోని పెంబర్తి గ్రామ సమీపంలో 106 సర్వే నెంబర్ లోని ప్రభుత్వ స్థలంలో రూ.5 కోట్లతో నిర్మించనున్న మహిళా శక్తి భవనానికి అనువైన స్థలాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి వసంత, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థలాన్ని చదును చేయడంతో పాటు బోర్ వేసి విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.








# ఇంటి నంబర్ల కోసం సీపీఎం దీక్ష

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలో మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులు నిర్మించుకున్న ఇండ్లకు ఇంటి నంబర్లు వేసి కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. మొదటి రోజు దీక్షలు పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ ప్రారంభించి మాట్లాడారు. 2012- 13 లో గత కాంగ్రెస్ ప్రభుత్వం జనగామ పట్టణంలోని నిరుపేదలకు 1,144 ఇంటి స్థలాలు ఇచ్చి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. పేదలు అనేక ఇబ్బందులు పడి ఇంటి నిర్మాణం చేసుకున్నారని, కానీ గత ప్రభుత్వంలోని ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గాని పేదలకు అన్యాయం చేస్తూ వారి సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇంటి నెంబరు వేయకపోవడంతో కనీస సౌకర్యాలు అయిన మంచినీళ్లు, విద్యుత్తు, రోడ్లు వేయకపోవడంతో అక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించి పేదలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్య చందు నాయక్, ముసుపట్ల జయ, తేరాల అండాలు, ఏనుగుల కమల, గంగా కౌర్ గంగాధరి, సురేష్, సిలివేరి ఉపేందర్, బాలస్వామి, మంద అమల, రాములు, నీల సమ్మక్క, స్వరూప, దానమ్మ, సుజాత, సిద్ధమ్మ, భారతమ్మ, అమ్మి, భీష్మ, రాణి, సర్వర్, బేగం, ఇమాంబి తదితరులు పాల్గొన్నారు.



# చేర్యాల మున్సిపాలిటీలో పరిశుభ్రతపై అవగాహన

**చేర్యాల, మన చౌరాస్తా :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక చర్య ఒక మార్పు 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ పరిధిలోని వార్డులలో తడి పొడి చెత్త వేరు చేయడం, వాహనాలకు అందించడం, మోరీలను శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తను మోరీలో వేయకుండా చూడడం, నీటి నిలువలు లేకుండా చూడడం, వ్యక్తిగత పరిశుభ్రత, ప్రతి ఇంట్లో పది మొక్కలు నాటే కార్యక్రమం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి వ్యాధులు సోకకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఖాళీ స్థలాలలో మల మూత్ర విసర్జన చేయకూడదనే అంశాలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేందర్, వార్డు ఆఫీసర్లు, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒలంపిక్ డే క్రీడా పోటీలు

**జనగామ, మన చౌరాస్తా :** జూన్ 26 ఒలంపిక్ డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఆహ్వానం పలికిందని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ ఒలంపిక్ క్రీడలు ఉదయం 6 నుండి ఉదయం 9 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ధర్మకంచలో ఉన్న మినీ స్టేడియంలో నిర్వహించబడతాయని వీటితో పాటు ఇతర కార్యక్రమాలు కూడా నిర్వహించబడతాయన్నారు. 18న ఉదయం 6 గంటలకు 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, 19 న షార్ట్ పుట్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్ క్రీడలు ఉంటాయన్నారు. 20న చెస్, క్యారమ్స్ ప్రత్యేకంగా దివ్యాంగ మహిళలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జనగామ వారి సహకారంతో 'యోగా' కార్యక్రమం ఉంటుందన్నారు. 23న త్రీ కే రన్ నెహ్రూ పార్కు నుంచి కలెక్టర్ కార్యాలయం (ఐడిఓసి) వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



# బీజేపీతోనే అన్ని రంగాల అభివృద్ధి

- రిటైర్డ్ కల్నల్ డాక్టర్ భిక్షపతి

**చేర్యాల, మన చౌరాస్తా :** బీజేపీతోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యం అవుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రిటైర్డ్ కల్నల్ డాక్టర్ భిక్షపతి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప సభ మండల కేంద్రంలో పట్టణ అధ్యక్షుడు కర్క తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ సూచన మేరకు బుధవారం సభ నిర్వహించగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత రామ మందిర నిర్మాణం, నేషనల్ హైవేల నిర్మాణం, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, వరంగల్ విమానాశ్రయ ఏర్పాటు, జాతీయ రహదారుల నిర్మాణం, దేశ సరిహద్దు రక్షణ, 14 వ ఫైనాన్స్ కింద గ్రామాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. అదేవిధంగా ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత దేశ ఆర్మీ యొక్క శక్తి సామర్థ్యం ప్రపంచాలకు తెలిసిందని అన్నారు. ప్రధాన మంత్రి ప్రజల కోసం చేస్తున్న కృషిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అంకుగారి శశిధర్ రెడ్డి, బూరుగు సురేష్ గౌడ్, తోకల ఉమారాణి, పోతుగంటి రాందాసు, పుర్మా సంజీవరెడ్డి, కొట్టె చంద్రమౌళి, పంగ సిద్ధులు, ఖాతా నాగరాజు, కాటం సురేందర్, నర్ర మహేందర్ రెడ్డి, ముచ్చంతుల సిద్ధారెడ్డి, షాదుల్లా, బింగి శ్రీనివాస్, గుడ్ల అంజయ్య, బిట్ల వెంకటేశం, ఇప్పకాయల సత్యనారాయణ, పాము వెంకటేశం, మిట్టపల్లి ఈదిరెడ్డి, కంఠారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బొడుగం నరసింహారెడ్డి, ముస్త్యాల శ్రీనివాస్, కంది ప్రసాద్, రాములు, చందు, మనీష్, సావిత్రిలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు. నరేంద్ర మోడీ పాలనకు ఆకర్షితులై ఔషర్ల రవీందర్ శ్రీలత దంపతులతో పాటు పలువురు పార్టీలో చేరగా కల్నల్ భిక్షపతి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం నూతనంగా చేరిన వారు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేస్తామని అన్నారు.



# బ్లైండ్ స్కూల్ చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా మల్కాపూర్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభ మయ్యాయని, సంబంధిత కోర్సులలో చేరే అంధులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎన్. భాస్కర్ తెలిపారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం, అలాగే 1వ నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో బోధన ఉంటుందన్నారు. పాఠశాలలో చేరే విద్యార్థులకు విద్యతో పాటు భోజన వసతి ఉంటుందన్నారు. అంతేగాక విద్యుత్ తో పాటు ప్రత్యేక సాఫ్ట్ వేర్ తో రూపొందించిన కంప్యూటర్ శిక్షణ, వివిధ కళల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ పాఠశాలల్లో చేరుటకు 6 నుంచి 14 సంవత్సరంల మధ్య వయసు కలిగి ఉండాలని జిల్లా మెడికల్ బోర్డుచే జారీ చేయబడిన సదరం సర్టిఫికెట్ (40 నుంచి 100 శాతం అంధత్వం) కలిగిన బాల బాలికలు అర్హులుగా పేర్కొన్నారు. అంధ బాలబాలికలను వారి తల్లిదండ్రులే కాకుండా సంరక్షకులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు అర్హులైన అంధులను పాఠశాల చేర్పించి, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఇతర వివరములకు ఈ నెంబర్లకు 9440550345, 9701190124, 9700457939, 9440338424 వాట్సాప్ ద్వారా సదరం, ఆధార్ కార్డు, యూడిఐడి కార్డు కాంటాక్ట్ నెంబర్స్ పంపవలసిందిగా కోరారు.





## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై

# ప్రత్యేక దృష్టి పెట్టాలి

- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పక్కాగా అములు చేయాలని, నియోజక వర్గానికి కేటాయించిన 3,500 ఇండ్ల లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. మంగళవారం జనగామ కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రగతిపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి సమీక్షించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం తొలుత పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇండ్ల ప్రగతిని సమీక్షించారు. అలాగే రెండో విడతగా ఐదు మండలాల్లో ఇందిరమ్మ ఇండ్లకు మంజూరు పత్రాలు అందజేయగా ఇండ్లకు మార్కింగ్ వేగవంతంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఇండ్ల నిర్మాణాలలో అధికారులు లబ్ధిదారునికి అండగా ఉంటూ వెన్నంటి ప్రోత్సహిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని సూచించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తెలియజేస్తూ సాధ్యమైనంత వరకు ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా సహకరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని ఇది రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ ఆర్డీఓ డి.ఎస్ వెంకన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమంత నాయక్, హౌసింగ్ పీడీ మాత్రు నాయక్, డీఈ చంద్ర శేఖర్, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.



# భూగర్భ జలాలను కాపాడాలి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** భూగర్భ జల వనరుల పరిరక్షణలో జనగామ జిల్లా ముందంజలో ఉందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. భూగర్భ జలాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయ, ఇరిగేషన్ , పంచాయతీరాజ్, వివిధ శాఖల అధికారులతో భూగర్భ జల వనరుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం మంగళవారం కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంచడానికి అలాగే పరిరక్షణకు వివిధ శాఖల ఆధ్వర్యంలో విస్తృతంగా చర్యలను చేపట్టడం వల్ల జిల్లా లో గణనీయం గా మార్పు వచ్చిందన్నారు. భూగర్భ జలాల స్థాయిలను వివిధ శాఖల అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు భూగర్భ జలాల ప్రాముఖ్యతను వివరించి, వాటిని పరిరక్షించాల్సిన ఆవశ్యకతను తెలియజేసి రానున్న వర్షాకాల నేపథ్యంలో వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలోకి ఇంకేలా చేయాలన్నారు. సమావేశం లో జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారి అశోక్, డీఆర్డీవో వసంత, డీఏవో రామారావు నాయక్, ఇరిగేషన్ ఈఈ, జిల్లా ఉద్యన శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.








# వృద్ధాశ్రామంలో అన్నదానం

**జనగామ, మన చౌరాస్తా :** మార్క యాదమ్మ, లక్ష్మీనారాయణ గౌడ్ జ్ఞాపకార్థం వారి కుమారులు మార్క ఉపేందర్ గౌడ్, మార్క నరసింహులు గౌడ్ జనగామ పట్టణంలోని రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మణికుమార్, ముఖ్య సలహాదారుడు భీమరాజు మాట్లాడుతూ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించిన మార్క యాదమ్మ, లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు ఆకలి చావులు లేకుండా చేయడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి నల్ల వినోద్ కుమార్, బింగి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## విజయ్‌సేతుపతి, పూరి సినిమా

# టీమ్‌లో చేరిన సంయుక్త



విజయ్ సేతుపతి హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమా రూపొందిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో నటి సంయుక్త జాయిన్ అయినట్లు తెలుపుతూ టీమ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. ఆమె నడకలో హుందాతనం.. కళ్లల్లో ఆగ్రహం.. అంటూ సంయుక్తకు స్వాగతం పలుకుతూ ఆమెతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఇందులో ఆమె పాత్ర కీలకంగా ఉండనున్నట్లు వెల్లడిరచారు. ఇప్పటికే ఈ సినిమాలో సీనియర్ నటి టబు భాగమైన విషయం తెలిసిందే. ఇక ఈ చిత్రానికి 'బెగ్గర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు మొన్నటివరకూ వార్తలు వచ్చాయి. తాజాగా 'భిక్షాందేహి' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.దర్శకుడిగా విజయాన్ని అందుకునేందుకు గత కొంతకాలంగా ఎదురుచూస్తున్నారు పూరి జగన్నాథ్. ఆయన గత చిత్రాలు 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయాయి. దీంతో హిట్ అందుకోవడమే లక్ష్యంగా విజయ్ సేతుపతితో కొత్త ప్రాజెక్ట్ ప్రకటించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక సంయుక్త వరుస ప్రాజెక్ట్‌లతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. బాలకృష్ణ హీరోగా బోయపాటి శీను దర్శకత్వంలో రానున్న 'అఖండ 2'లోనూ ఆమె భాగమయ్యారు. ఇటీవలే చిత్రబృందం ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిరచింది.






## కుబేరతో అలరించనున్న

# ధనుష్..రష్మిక




ఎన్నో వైవిధ్యమైన పాత్రలు చేస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు నటుడు ధనుష్. సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి హాలీవుడ్ హీరోల ప్రశంసలు అందుకుంటున్నారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'కుబేర' జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ధనుష్ మ్యాష్‌అప్ వీడియోను ప్రదర్శించారు. అది చూసిన అభిమానులు గూస్‌బంప్స్ వచ్చేలా ఉందంటూ అభిప్రాయపడుతున్నారు. తాను హాలీవుడ్ సినిమాలో నటిస్తానని చెబితే ప్రజలు నవ్వేవారని ధనుష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఇకపోతే ఇదే సినిమాలో రష్మిక నటించారు. నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకొని వరుస సినిమాలతో అలరిస్తున్నారు రష్మిక. 'కుబేర'తో జూన్ 20 నుంచి సందడి చేయడానికి సిద్ధమయ్యారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మ్యాష్‌అప్ వీడియో ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఇందులో ఆమెపై ఇండస్ట్రీలో అగ్ర హీరోలు ప్రశంసలు కురిపించడం చూపించారు.. అలాగే తాను కెరీర్ ప్రారంభంలో ఓ ఆడిషన్ ఇస్తే రిజెక్ట్ చేశారంటూ రష్మిక ఓ ఇంటర్వ్యూలో పంచుకున్న వీడియోను ప్లే చేశారు.

## రెట్రో సీరిస్ వర్షన్

# విడుదలకు రెడీ

తమిళ సూపర్ స్టార్ సూర్య నటించిన సూపర్ హిట్ చిత్రం రెట్రో. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ యాక్షన్ డ్రామాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, శ్రియ ప్రత్యేక గీతంలో కనిపించారు. 65 కోట్ల బ్జడెట్‌తో రూపొందిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తెలుగులో మిశ్రమ స్పందనలను అందుకోగా.. తమిళంలో మాత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈ చిత్రం ఓటీటీ వేదిక నెట్‌ప్లిక్స్‌లో స్ట్రీమ్రింగ్ అవుతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు. నాలుగు నెలల్లో 'రెట్రో' సిరీస్ వెర్షన్ విడుదల చేయాలని తాను ఆలోచిస్తున్నట్లు సుబ్బరాజు ప్రకటించారు. ఈ ఎక్స్‌టెండెడ్ వెర్షన్‌లో కేవలం తొలగించిన సన్నివేశాలు మాత్రమే కాకుండా, అనేక భావోద్వేగపూరిత సన్నివేశాలు మరింత వివరంగా ఉండేలా ప్లాన్ వేస్తున్నానని ఆయన తెలిపారు. అయితే, ఈ విషయంలో నెట్‌ప్లిక్స్ సుముఖంగా లేదని, అందుకే వారితో చర్చలు జరుపుతున్నానని సుబ్బరాజు పేర్కొన్నారు. 'రెట్రో'ను కొన్ని ఎపిసోడ్‌లుగా తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నానని, ఒక్కో ఎపిసోడ్ సుమారు 40 నిమిషాలు ఉండేలా చూస్తున్నానని చెప్పారు. హాస్యం, ప్రేమ, యాక్షన్ వంటి అంశాలను ఒక్కో ఎపిసోడ్‌లో హైలైట్ చేయాలనేది తన ఆలోచన అని సుబ్బరాజు వెల్లడిరచారు.

